అర్హులైన ప్రతి లబ్ధిదారుడికీ నవరత్న పథకాలు



చింతలపూడి షాదీఖానాలో సచివాలయ కన్వీనర్ల ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా



కామవరపుకోటలో మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

- చింతలపూడిలో సచివాలయ కన్వీనర్లతో సమావేశం
- ఎమ్మెల్యే ఎలీజా పిలుపు

చింతలపూడి: అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నవరత్న పథకాలు చేరాలనే లక్ష్యంతో రాష్ట్రంలో సచివాలయ కన్వీనర్లను నియమించినట్లు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. స్థానిక షాదీఖానాలో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమంలో భాగంగా సచివాలయాల మండల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు అధ్యక్షతన సచివాలయ కన్వీనర్ల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఎలీజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో కన్వీనర్లు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు, ఎల్లో మీడియా కలిసి చేస్తున్న అసత్య ప్రచారాలను, కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, చింతలపూడి సచివాలయాల మండల కన్వీనర్ టి శ్రీనివాసరావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎన్ దుర్గారావు, లింగపాలెం మండల సచివాలయాల కన్వీనర్ అన్నపనేని శాంతారావు, కామవరపుకోట మండల సచివాలయాల కన్వీనర్ షేక్ మీరా సాహెబ్, పట్టణ సచివాలయ కన్వీనర్ పండు ప్రసన్న, జంగారెడ్డిగూడెం మండల సచివాలయాల కన్వీనర్ గురజాల పార్థ సారథి, పట్టణ సచివాలయ కన్వీనర్ చలమల శ్రీను, చింతలపూడి పట్టణ వైసీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులుగా చేయడమే సీఎం జగన్ లక్ష్యం

కామవరపుకోట: రాష్ట్రంలోని మహిళలను లక్షాధికారులుగా చేయడమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం అని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలిజా అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలో మూడో విడత ఆసరా పథకం ద్వారా 1,290 డ్వాక్రా గ్రూపులకు 12,678 మంది మహిళలకు రూ.15,52,98,000 అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ మహిళ సాధికారతే లక్ష్యంగా మహిళ పక్షపాతిగా వారిని ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ వచ్చారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పసుపు కుంకుమ పేరుతో రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలను మాయ మాటలతో మోసం చేశారన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి పదవి చేపట్టిన వెంటనే డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం ఆసరా పథకం ద్వారా 2019 సంవత్సరం నాటికి రాష్ట్రంలో ఉన్న 79 లక్షల మంది డ్వాక్రా మహిళలకు 4 విడతలుగా మహిళల అకౌంట్లో జమ చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది మహిళలకు స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. మహిళలు టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మవద్దని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచి జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, చింతలపూడి ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు జానకి రెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ వందు జగదీష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, టౌన్ కన్వీనర్ నానాది సాగర్, ఎంపీడీవో కె.శ్రీదేవి, ఏపీఎం గుర్రాల భానుమతి, తహసిల్దార్ డీవీసత్యనారాయణ, మండల విద్యాశాఖ అధికారి డి.సుబ్బారావు, కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనూష, వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామ్మోహన్ రావు, మండల సచివాలయాల కన్వీనర్ పండు ప్రసన్న, ఎంపీటీసీలు కనికెళ్ల రత్నకుమారి, తమ్మిశెట్టి గిరిజ, మేడంకి పద్మ, బొల్లు వెంకట సత్యనారాయణ, బూరుగు శ్రీను, గృహ సారథులు, మహిళా మండలి సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



అటవీ ప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ

బుట్టాయగూడెం: మండలంలోని కొమ్ము గూడెం శివారు మర్లగూడెం దట్టమైన అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మవారిని శుక్రవారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి మంగళవారం, శుక్రవారం, ఆదివారం రోజుల్లో కొమ్ముగూడెం, కంగాలవారిగూడెం, వేదాంతపురం, సరిపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఇక్కడికి చేరు కుని అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు. కొమ్ము గూడెంకు చెందిన యాండ్రప్రగడ సురేంద్ర ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు.

వెండి సర్ప కిరీటం సమర్పణ



ఉమారామలింగేశ్వరునికి వెండి సర్ప కిరీటాన్ని సమర్పిస్తున్న దాత పారేపల్లి కిరణ్‌కుమార్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం బైనేరు వద్ద ఉన్న ఉమా సహిత రామలింగేశ్వరస్వామికి వెండి సర్ప కిరీటాన్ని దాత శుక్రవారం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు బొచ్చు రామ్మోహన్‌రావు, మేకా సింహాద్రి మాట్లాడుతూ మండలంలోని అక్కంపేటకు చెందిన పారేపల్లి కిరణ్‌కుమార్, కుటుంబ సభ్యులతో కలిసి 750 గ్రాముల వెండి కిరీటాన్ని స్వామి అలంకరణ నిమిత్తం అందజేసినట్లు చెప్పారు. అర్చకులు తేజ దాతలకు వేద ఆశీర్వాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ వీఆర్వో సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో పూజలు



వైస్ ఛాన్సలర్ విజయకుమార్‌కు శ్రీవారి మెమెంటోను అందజేస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్రంలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ఎం.విజయకుమార్ శుక్రవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని అందజేశారు. ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు ఆయనకు చినవెంకన్న మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

పదో తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత



పదో తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న వైసీపీ నాయకులు

లింగపాలెం: శింగగూడెం హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యాసామగ్రి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు అందజేశారు. శుక్రవారం శింగగూడెం సర్పంచ్ కోటగిరి వెంకట సుప్రియ, వైసీపీ నాయకులు కోటగిరి హరీష్, కోటగిరి ధీరాజ్‌కృష్ణ చేతుల మీదగా త్వరలో పదో తరగతి పరీక్షలు రాయనున్న 80 మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, స్టడీ మెటీరియల్, పెన్నులు అందజేశారు. హెచ్‌ఎం శ్రీధర్, స్కూల్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరమ్మ, వైసీపీ నాయకులు శావా రాజేష్, కొప్పుల వెంకటేశ్వరరావు, పామర్తి సుబ్బారావు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి చెంతన చెత్త దగ్ధం

కొయ్యలగూడెం: బైనేరు వంతెన వద్ద జాతీయ రహదారికి ప్రక్కన చెత్తను దగ్ధం చేస్తుండడంతో రహదారి ప్రయాణికులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. కొయ్యలగూడెం- జంగారెడ్డిగూడెం మండలాల సరిహద్దు అయిన వంతెనకు దగ్గరగా చెత్తను దగ్ధం చేయడం వివాదాస్పదంగా కూడా మారిన సంఘటనలు ఉన్నాయి. దీనివల్ల అగ్నికీలలు ఎగిసి పడడంతో పాటు దట్టమైన పొగ కమ్ము కుని ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు గందరగోళానికి గురి అవుతున్నారు. ఇటీవల ఇక్కడ రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. హైవే అధికారులతో పాటు మున్సిపాలిటీ అధికారులు స్పందించి సమస్యల పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆత్మ జ్ఞాన ధ్యాన శిక్షణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం శేషాద్రి నగర్‌లోని శ్రీగారీ సుభద్ర పిరమిడ్ ధ్యాన మందిరంలో ఏప్రిల్ 2, ఆదివారం ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ది జంగారెడ్డిగూడెం పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒకరోజు ఆత్మ జ్ఞాన ధ్యాన శిక్షణ నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కాకి రామకృష్ణ, తటవర్తి కృష్ణ తెలిపారు. విజయవాడకు చెందిన ధ్యాన రత్న, సీనియర్ పిరమిడ్ మాస్టర్ కె.వి.స్వామి శిక్షకుడిగా పాల్గొంటారని తెలిపారు. ధ్యానులు, ఆధ్యాత్మిక సాధకులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

జామియా మసీదులో ఇఫ్తార్ విందు



కొయ్యలగూడెం జామియా మసీదులో ఇఫ్తార్ విందు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం జామియా మసీద్‌కి వైఎస్సార్ సీపీ నాయకులు, పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు రంజాన్ తోఫా అందజేశారు. శుక్రవారం నమాజు అయిన సందర్భంగా రూ.20 వేల విలువైన వాటర్ మోటార్‌ను మసీదుకి బహుమానంగా అందించారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ పెద్దలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కొయ్యలగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడితోపాటు త్రిసభ్య కమిటీ సభ్యులు ఒంటిమిట్ట రామాలయంలో కల్యాణం, రంజాన్, గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు.

ముద్దాయిలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి



సబ్ జైలును సందర్శించి ముద్దాయిలకు అందుతున్న సౌకర్యాలపై జైల్ అధికారులను ఆరాతీస్తున్న జూనియర్ సివిల్ జడ్జి పరేష్‌కుమార్

చింతలపూడి: ముద్దాయిలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి పి పరేష్ కుమార్ సూచించారు. చింతలపూడి సబ్ జైల్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సబ్‌జైల్‌ను పరిశీలించి ముద్దాయికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిలు న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేకపోతే వారి కేసులను అప్పీల్ చేసుకోవడానికి న్యాయ సేవా కమిటీ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ముద్దాయిలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మళ్లీ నేరాలకు పాల్పడి జైలుకు రావద్దని అన్నారు. అనంతరం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎల్‌వీ చైతన్య, టోకూరి వెంకటేష్, సోషల్ వర్కర్ అక్బర్ ఆలి, సూపరింటెండెంట్ గోలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాఘవాపురంలో సహకార సంఘ మహాజన సభ



రాఘవాపురం సహకార సంఘ మహాజన సభలో జమా ఖర్చులను వివరిస్తున్న సొసైటీ కార్యదర్శి

చింతలపూడి: సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని రైతులు వాటిని వినియోగించుకోవాలని సొసైటీ చైర్మన్ చుండూరి నాగేశ్వరరావు అన్నారు. రాఘవాపురం సహకార సంఘ మహాజన సభ శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయంలో చుండూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సహకార సంఘ కార్యదర్శి సీహెచ్ రమేష్ 2022, 2023 మార్చి వరకు సంబంధించి సంఘంలో చేపట్టిన కార్యక్రమాలపై జమా, ఖర్చులను సభలో ప్రవేశపెట్టడంతో సభ్యులు ఆమోదం తెలిపారు. రైతుల సంక్షేమం కోసం సొసైటీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం రైతులు సభ దృష్టికి తీసుకు వచ్చిన పలు అంశాలపై చర్చించారు. సహకార సంఘ పర్సన్‌లు తాటిపర్తి పద్మ, చిమటా జగన్నాథరావు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని వినతి



తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న పోరాట సమితి సభ్యులు

టి.నరసాపురం: ఎర్ర కాలువ వెలుపలి గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రత్యేక గ్రామపంచాయతీ పోరాట సమితి సభ్యులు కోరారు. శుక్రవారం పుట్రేవు అడ్డ రోడ్డు వద్ద వంట వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి ఎన్‌టీ స్వామికి, తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రకాలువ వెలుపలి గ్రామాలైన కృష్ణా పురం, పుట్రేవు, ప్రకాష్ నగర్, రుద్రకోట రాజు గూడెం, కాపుగూడెం, అల్లూరి సీతారామరాజు నగర్ గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలన్నారు. భూక్యవేణు, కుంజకిరణ్, భూక్య శ్రీనివాస్, పండు, భద్రం, మట్ట శ్రీను, బరగడ రాముడు కురం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కంప్యూటర్ల నిర్వహణలో నిర్లక్ష్యం



సచివాలయం వద్ద మూలన పడి ఉన్న కంప్యూటర్ సిస్టం

కొయ్యలగూడెం: సిబ్బంది నిర్లక్ష్యానికి విలువైన పరికరాలు మూలన పడుతున్నాయి. దిప్పకాయలపాడు సచివాలయం వద్ద కంప్యూటర్ మోనిటర్, సీపీయూలతో సహా కార్యాలయానికి వెనుక మరుగుదొడ్డి వద్ద పడవేయడం నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచింది. కానీ పరికరాలు పూర్తిగా పని చేస్తున్నవే అయినప్పటికీ బయటపడవేయడం చర్చనీయాంశంగా మారింది. దీనికి గల కారణాలను తెలపడానికి సిబ్బంది మోహం చాటు వేయగా ఇది చూసిన ప్రజలు అవాక్కయ్యారు. ఎంపీడీవో కేఆర్‌ఎస్ కృష్ణ ప్రసాద్ దృష్టికి దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో ఆయన విచారణ చేపడతామని పేర్కొన్నారు.

కల్యాణ తలంబ్రాల పంపిణీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శుక్రవారం కల్యాణ తలంబ్రాలు పంపిణీ చేశారు. పరిషత్ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ, కొనకళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో 2002 నుంచి 2014 వరకు భద్రాచలం వరకూ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. 2002వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు జంగారెడ్డిగూడెం, పరిసర గ్రామాల్లో సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవానికి తలంబ్రాల వితరణ చేస్తున్నామని తెలిపారు.

గిరిజన లబ్ధిదారుల జీవనస్థితిగతులపై అధ్యయనం



రెవెన్యూ కార్యాలయంలో మాట్లాడుతున్న మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ బృందం సభ్యులు

పోలవరం రూరల్: అటవీ ప్రాంతంలో ఆర్‌వోఎఫ్ఆర్‌లో పట్టాలున్న గిరిజన లబ్దిదారుల జీవన స్థితిగతులపై మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ బృందం సభ్యులు పరిశీలన చేపట్టారు. క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చినట్లు బృందం సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని ప్రాజెక్టు ముంపు గ్రామమైన మామిడిగొందిలో వీఎస్ఎస్ ఆధ్వర్యంలో పెంచుతున్న టేకు ప్లాంటేషన్‌ను పరిశీలించారు. జిల్లెళ్లగూడెంలో ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలున్న లబ్ధిదారులతో శుక్రవారం మాట్లాడారు. పట్టాలు పొందిన లబ్దిదారులు ఆ భూముల్లో చేస్తున్న వ్యవసాయం, ఫలసాయం, ప్రజల ఆర్థిక స్థితిగతులు, ప్రభుత్వం అందించే సహకారాలపై వివరాలు సేకరించారు. ఐఐపీఏ న్యూఢిల్లీకి చెందిన డైరెక్టర్ జి. మహాపాత్ర ఆధ్వర్యంలో బృందం సభ్యులు మాట్లాడారు. దేశంలో ఉత్తరప్రదేశ్, త్రిపుర, జార్ఖండ్, మహారాష్ట్ర, ఒరిస్సా, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఆర్‌వోఎఫ్ఆర్‌లో పట్టాలు ఇచ్చే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ 7 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని డైరెక్టర్ మహాపాత్ర తెలిపారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ అక్షయ మహాపాత్ర, సుధీర్‌పాల్, శిరీష్, అభిషేక్, ఐటీడీఏ ఏపీవో వీవీఎస్ నాయుడు, తహసీల్దార్ సుమతి, అటవీశాఖ ఎఫ్ఎస్ఓ ప్రసాద్ పాల్గొన్నారు.

అధికారుల ఏకపక్ష నిర్ణయాలు తగవు

- అభివృద్ధి పనులపై చైర్మన్ సమీక్ష నిర్వహించాలి
- జంగారెడ్డిగూడెం మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్





మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, హాజరైన సభ్యులు

జంగారెడ్డిగూడెం: కౌన్సిల్‌ను సంప్రదించకుండా అధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం తగదని కౌన్సిలర్లు అన్నారు. ఇప్పటికైనా వివక్ష మాని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని వారు కోరారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, కౌన్సిలర్లు తమ వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై చైర్‌పర్సన్ సమీక్ష నిర్వహించాలని కౌన్సిలర్లు కోరారు. కౌన్సిలర్ పీపీఎస్ చంద్రరావు మాట్లాడుతూ అజెండాలో పేర్కొన్న బుట్టాయగూడెం రోడ్డు నిర్మాణం, గుంతలు పడిన సీసీ రోడ్ల తాత్కాలిక మరమ్మతులపై మాట్లాడుతూ శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ కాసర తులసి, ఇందిరా ప్రియదర్శిని, కనుమూరి లావణ్య, దిర్శిపోము లక్ష్మి, షేక్ రహీమా, ముప్పాని వెంకటరమణ తదితరులు పలు అంశాలను సభలో ప్రస్తావించారు. రోడ్లు, డ్రెయిన్, మంచినీటి సమస్యపై దృష్టి సారించాని కౌన్సిలర్లు కోరారు. 1వ వార్డులో వీధిలైట్లు వెలగడం లేదని అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని అన్నారు. 17వ వార్డులో బోరు నిరుపయోగంగా ఉందని, రోడ్లు, డ్రెయిన్లపై దృష్టి సారించాలని కోరారు. పట్టణంలో కుక్కల, పందుల బెడద తీవ్రంగా ఉందని కౌన్సిలర్లు పేర్కొన్నారు. డంపింగ్ యార్డుకు నిప్పు పెట్టడం వల్ల పరిసర ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పీపీఎస్ చంద్రరావు మాట్లాడుతూ స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా జగ్గయ్యపేట నుంచి వచ్చిన వ్యక్తులకు అధికారులు ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. పాలకవర్గానికి, ప్రజాప్రతినిధులకు తెలియకుండా అధికారులు తమకు కావాల్సిన వారిని ఉద్యోగాల్లో నియమించుకుంటున్నారని, ఎంపికైన వారి జాబితా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, కమిషనర్ పి.భవానీప్రసాద్ సభ్యులను సముదాయిస్తూ సమావేశాన్ని ముగించారు. ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ కౌన్సిలర్ హడావుడి

జంగారెడ్డిగూడెం: తన వార్డులో అభివృద్ధి పనులు చేపట్టలేదంటూ సమావేశ హాలులోకి తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ తీసి ఆత్మహత్య చేసుకుంటానని జంగారెడ్డిగూడెం మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ సంకు సురేష్ హడావుడి చేశారు. చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కౌన్సిలర్ సురేష్ తన వార్డు సమస్యలు తెలుపుతూ అకస్మాత్తుగా తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ తీసుకుని ఆత్మహత్య చేసుకుంటాననడంతో సమావేశ హాలులో కలకలం రేగింది. పక్కనే ఉన్న కౌన్సిలర్ వలవల తాతాజీ, సురేష్ చేతిలోని పెట్రోల్ బాటిల్ తీసుకోగా ఇతర కౌన్సిలర్లు దూరంగా పెట్టారు. సబార్డినేట్ గణేష్ పెట్రోల్ బాటిల్‌ను బయటపడేశారు. కౌన్సిల్ సభ్యులు జోక్యం చేసుకుని సురేష్ ఇలా చేయడం సరికాదని, సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సర్దిచెప్పారు. అన్ని వార్డుల్లోనూ సమానంగా అభివృద్ధి పనులు చేపట్టాలని పలువురు సభ్యులు చైర్‌పర్సన్‌కు, కమిషనర్ భవానీప్రసాద్‌కు సూచించారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా 3వ విడత రుణమాఫీ కార్యక్రమం ఏప్రిల్ 1వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ శంకర్ శుక్రవారం తెలిపారు. స్థానిక ఆలపాటి గంగాభవానీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి చింతలపూడి నియోజకవర్గం ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి పాల్గొని చెక్కులు పంపిణీ చేస్తారన్నారు.

ఆశీల వేలం ఖరారు కాలేదు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ 2023-24 సంవత్సరానికి రెవెన్యూ విభాగానికి సంబంధించి మార్కెట్ ఆశీల పాట ఖరారు కాలేదని జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. అగ్రిమెంట్ రిజిస్టర్ అయిన అనంతరం పాటదారు పేరును ప్రకటిస్తామన్నారు. అంత వరకు శిస్తులను సంఘ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు మాత్రమే చెల్లించాలన్నారు. నిబంధనకు విరుద్ధంగా ఎవరైనా శిస్తులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పురపాలక సంఘం గెజిట్ ప్రకటించిన శిస్తులను మాత్రమే చెల్లించాలని ఆయన పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 3వ తేదీ సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న పాపులర్ లెక్చర్ సిరీస్ జాతీయ సదస్సు పోస్టర్‌ను శుక్రవారం ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ న్యూఢిల్లీ సహకారంతో జాతీయస్థాయి సదస్సును నిర్వహిస్తామన్నారు. ప్రముఖ ఉపన్యాసకులుగా శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు డాక్టర్ ఎస్ రామకృష్ణ, విశాఖపట్నం ఐ.ఐ.పి.ఇ కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ సీహెచ్ గుప్తా చందలూరి పాల్గొంటారని రవీంద్ర బాబు తెలిపారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

జంగారెడ్డిగూడెం: పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసి బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారాన్ని అందజేయాలని ఐసీడీఎస్ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ అన్నారు. జంగారెడ్డిగూడెం శాంతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. మెనూ, పిల్లల హాజరు శాతం, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. సీడీపీవో పి.బ్యూల, సూపర్‌వైజర్ కె.లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

రామాలయంలో పూజలు

దెందులూరు: సోమవరప్పాడులోని కొత్తూరు రామాలయంలో శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి స్వామివారికి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలోపాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేను మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, సొసైటీ చైర్మన్ వేమూరి బసవపున్నయ్య, గ్రామ సర్పంచ్ సరిగే నాగరాజు,వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శుక్రవారం సోమవరప్పాడులో గుండె శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న కాట్రగడ్డ ప్రవీణ్ తండ్రిని పరామర్శించారు. వెన్నుముక వ్యాధితో బాధపడుతున్న బొలుసు రామును పరామర్శించారు. చెట్టుపై నుంచి పడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న జగన్నాధపురం గ్రామానికి చెందిన అంకెం వెంకటేశ్వరరావును పరామర్శించారు. చైత్ర ఆసుపత్రిలో పెదపాడు గ్రామానికి చెందిన పడాలి నాగరాజు కుమారుడిని పరామర్శించారు. జోగన్నపాలెం గ్రామానికి చెందిన బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ ఏలూరు చైత్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మున్నా లాజర్‌ను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

జంగారెడ్డిగూడెం: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని జంగారెడ్డిగూడెం సీఐ పి.బాలసురేష్‌బాబు అన్నారు. జంగారెడ్డిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ బ్లాక్‌స్పాట్ ప్రాంతంలో సీఐ బాలసురేష్‌బాబు, ఎస్సై ఎం.సాగర్‌బాబు శుక్రవారం వైట్ మార్కింగ్ వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఇటీవల చోటు చేసుకున్న ప్రమాదాల్లో ద్విచక్రవాహనదారులు తలకు తీవ్ర గాయం కావడం కారణంగానే మృతి చెందారన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబ్‌స్టేషన్ ప్రాంతంలో బ్లాక్ డేంజర్‌స్పాట్ బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయిన్‌ను నిర్మించాలని వినతి

జంగారెడ్డిగూడెం: ప్రతిపాదించిన డ్రెయిన్‌ను వెంటనే నిర్మించాలని ఉప్పలమెట్ట ప్రాంతవాసులు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం కౌన్సిలర్ ఇందిరా ప్రియదర్శినితో కలిసిన వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పలమెట్ట ప్రాంతంలో డ్రెయిన్ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. కౌన్సిలర్ ప్రియదర్శిని మాట్లాడుతూ డ్రెయిన్ కౌన్సిల్ దృష్టికి తీసుకురాగా, గతేడాది జనవరిలో రూ. 4.26 లక్షలతో 1,100 మీటర్ల పొడవున డ్రెయిన్ నిర్మించేందుకు ప్రతిపాదించారన్నారు. నేటికీ పనులు ప్రారంభించలేదన్నారు. స్థానిక ప్రజలు కౌన్సిలర్‌తో కలిసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ కాంట్రాక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.